క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



దుర్గి: మండల పరిధిలోని ఓబులేశునిపల్లెలోని కోటా సైదయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రముఖ బహుళజాతి పురుగు మందుల కంపెనీ బయోస్టాట్ పదో తరగతి విద్యార్థులు 20 మందికి ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కంపెనీ రీజనల్ మేనేజర్ సిహెచ్.నాగభూషణరావు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, పల్నాడు ఏరియా డిస్ట్రిబ్యూటర్ కోటా హనుమంతరావు, కోటా మణి, కోటా జానకిరామ్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఈ పాస్ యంత్రాలతో ఎరువులు పంపిణీ చేయాలి

రెంటచింతల: డీలర్లు ఈ పాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువుల పంపిణీ చేయాలని మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మరెడ్డి సోమవారం కోరారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకానికి ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్ష పత్రాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులను వాడుకోవాలన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.5.80 కోట్ల నిధులు

దాచేపల్లి: రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.80 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎంపీపీ కటకం జయశ్రీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి విన్నవించిన మీదట ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనట్లు చెప్పారు. అందులో అద్దంకి– నార్కెట్‌పల్లి హైవే నుంచి ఇరికేపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.96 లక్షలు, గురజాల మండలం పల్లెగుంత– గోగులపాడు వరకు రూ.4.02 కోట్లు, గురజాల మండలంలోని చర్లగుడిపాడు– జనార్థనపురం క్యాంప్ వరకు రూ.92 లక్షల మంజూరు అయినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో టెండర్లు ప్రక్రియ ప్రారంభించి అక్టోబర్‌లో పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ జయశ్రీ వెల్లడించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మిగిలిన రోడ్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయిస్తామని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రధాన రహదారులతో పాటుగా పొలంబాటలు అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మాచవరం: ఆధార్ క్యాంపులు మంగళవారం నుంచి 25వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యు.వరప్రసాద్ సోమవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 22న మోర్జంపాడు, మాచవరం, 23న పిల్లుట్ల, పిన్నెల్లి, 24న వేమవరం, మల్లవోలు, 25న కొత్త గణేశునిపాడు, చెన్నాయపాలెం గ్రామాల సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ అప్‌డేట్స్, ఆధార్ అనుసంధానం, ఆధార్ నమోదు తదితర సేవలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు విధులు నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. కావున మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గురజాల: ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... పులిపాడు గ్రామానికి చెందిన ఓర్సు నరసింహారావు సొంత పొలం 80 సెంట్లతో పాటు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, పత్తి పంట సాగుచేస్తున్నాడు. రెండేళ్లుగా సాగులో నష్టపోయాడు. ఆదివారం ఉదయం ఓర్సు నరసింహారావు, తమ్ముడు శ్రీరాములు, బంధువు చెన్నయ్య కలసి పొలం వెళ్లారు. విద్యుత్ మో టారు తీగలు పట్టుకుని బలవన్మరణానికి పా ల్పడ్డాడు. మృతుడికి బాబు, పాప ఉన్నారు. మృతుడి భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ

గురజాల: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎక్కులూరి రామకృష్ణను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు లోకం సుధాకర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నియమాక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్య నాయుడు, అసెంబ్లీ కన్వీనర్ అంబటి నవకుమార్, పునుగుల రవిశంకర్, ప్రభాకర్ రావు, దేరంగుల సత్యనారాయణ, కాళ్ల రమేష్, గంధం సురేష్, నరసింహారావు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల బైకు ర్యాలీ

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరి జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగారు.

పిడుగురాళ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

- రూ.1300 కోట్లతో పనులు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.1300 కోట్లతో పిడుగురాళ్ల పట్టణాన్ని అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం సోమవారం నిర్వహించారు. తొలుత నూతనంగా నిర్మించిన 3వ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వారికి అందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు పిడుగురాళ్ల పట్టణంలో తాగేందుకు తాగునీరు ఉండేది కాదని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.120 కోట్లతో పట్టణంలో ఉన్న 18 వేల ఇళ్లకు ఇప్పటికే సుమారు తొమ్మిది వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీ, వైద్యశాలలతో పాటు పట్టణంలో మూడు అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. లైమ్ సిటీ 8 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వటమే కాకుండా ఒక్కొక్కరికి రూ.2 లక్షలతో ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం అందిస్తున్నారు. గత నాలుగేళ్ల పాలనతో ఒక్క పిడుగురాళ్ల పట్టణానికి రూ.1300 కోట్లకు పైగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. పిడుగురాళ్ల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డును పూర్తి చేస్తున్నట్లు వివరించారు. జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జికి కూడా త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.19.33 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. దీంతో పాటు చెరువుల అభివృద్ధికి మరో రూ.10 కోట్లు మంజూరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ రొక్కం అనంతలక్ష్మి, 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దీన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, టౌన్ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వీరభద్రునిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాశం వెంకటేశ్వరరెడ్డి(చిన్నోడు), లోకసాని అంజిరెడ్డి, మేకల సైదారెడ్డి, తియ్యగురు వెంకటరెడ్డి, కొక్కెర పెద్ద కొండలు, పుణ్యాల చంద్రారెడ్డి, ఖాజా, కమాన్‌కట్టల బాషా, ఆతుకూరి శ్రీధర్, కోడూరి ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని రకాల పంటలతో నిరంతర ఆదాయం

రైతు సాధికార సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ వెంకట్రావు



లంకెలకూరపాడులో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు, అమలకుమారి

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): ప్రధాన పంటతో పాటు బహుళ పంటలు వేసుకోవడం వలన రైతులు అధిక లాభాలు పొందుతారని రైతు సాధికార సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ వెంకట్రావు, ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి పేర్కొన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఏ గ్రేడ్ మోడల్ విధానంలో 4 అడుగుల బెడ్లు, ఒక అడుగు కాలువ ఉండేటట్లు పొలం తయారీ చేసి తదుపరి 4 అంగుళాల దూరంలో బెడ్లమీద, ముల్లంగి, మెంతికూర, క్యారెట్, ఆవాలు, బీట్‌రూట్, గోంగూర, అలసంద, కంది విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి పంట పొలంలో విత్తుకోవాలన్నారు. సరిహద్దు పంటగా సజ్జలు, జొన్నలు, రాగులు, గట్ల మీద తీగ జాతి బీర, చిక్కుడు, కాకర విత్తనాలు నాటాలని చెప్పారు. మొదటి వరుసలో ముల్లంగి, రెండవ వరుస మెంతికూర, మూడు, నాల్గవ వరుసలో తోటకూర, ఐదో వరసలో క్యారెట్, ఆరో వరుసలో గోంగూర, బెడ్స్ మధ్యలో రెండు అడుగులకి ఒక్క మొక్కజొన్న, బెడ్ అంచుల నుంచి లోపల వైపు గోరుచిక్కుడు నాటుకోవచ్చన్నారు. బోర్డర్ పంటగా మొక్కజొన్న పంట నాటుకోవచ్చన్నారు. నిరంతరం ఆదాయం వచ్చే మోడల్‌లో ఈ విధానాన్ని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీపీ భవాని, ఎస్ఎఫ్ఏ నందకుమార్, మెంటార్ రజని పాల్గొన్నారు.

స్కాట్స్ కోటాలో మెడిసిన్‌లో విద్యార్థికి సీటు



ప్రతాపరెడ్డిని సత్కరిస్తున్న హెచ్ఎం సిస్టర్ విజయారాణి

సత్తెనపల్లి: పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డి స్కౌట్ కోటాలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం పాఠశాల ఆవరణలో ప్రతాపరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి సత్కరించారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో చదివి ఆరో తరగతిలో స్కౌట్‌లో చేరాడు. 2017 –18 సంవత్సరంలో స్కౌట్‌లో రాజ్య పురస్కార(గవర్నర్ అవార్డు) అందుకున్నాడు. 2022 –23 నీట్ పరీక్ష రాసి స్కౌట్ కోటాలో రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయారాణి మాట్లాడుతూ స్కౌట్‌లో జాయిన్ అయి మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించి గవర్నర్ అవార్డు పొందడంతో పాటు ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవతి, భాగ్యలక్ష్మి, అచ్చిరెడ్డి, పాకాలపాడు సర్పంచి తిప్పిరెడ్డి సుజాత, కృష్ణారెడ్డి, పి.పెద్దిరెడ్డి ఉన్నారు.

వృద్ధులకు ఆయుర్వేద వైద్యశిబిరం



వృద్ధులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వృద్ధులు జాతి సంపద అని వారి అనుభవాలు భవిష్యత్ తరాలకు అమూల్యమైన పాఠాలు అని బెల్లంకొండ మండల ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యుడు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు వృద్ధులపై ఆప్యాయత చూపుతూ గౌరవించి వారి అనుభవాల ద్వారా అభివృద్ధి బాటలోకి ప్రతి ఒక్కరూ రావాలని, వయసు రీత్యా వచ్చే ఆత్మన్యూనతా భావానికి లోనవకుండా వారికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు పరీక్షలు నిర్వహించి బలానికి అవసరమైన మందులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముప్పాళ్ల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పి.సరళ, గణపవరం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు కాంచన, హెల్ప్ ఫౌండేషన్ ఫౌండర్ కంచర్ల బుల్లిబాబు, సభ్యులు సురేష్, సోమశేఖర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు రిషిత, జిలాని పాల్గొన్నారు.

మెట్ట పంటల పరిశీలన



సోయాబీన్స్ పంట పరిశీలిస్తున్న ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు: వర్షాభావ పరిస్థితుల్లో తక్కువనీటితో సాగుచేసే పంటలను సాగుచేయడం ద్వారా లాభదాయకమైన దిగుబడులు సాధించవచ్చని పిడుగురాళ్ల ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో సాగుచేస్తున్న సోయాబీన్, మినుము పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోయాబీన్ సాగుచేస్తున్న రైతులు ఎకరాకు ఒక కిలో మల్టీ కేను లేదా పొటాషియం నైట్రేట్ కిలో 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పూతలో మారక మచ్చల పురుగు కన్పిస్తుందని చెప్పారు. నివారణకు ప్రొపినోఫాస్ రెండు మిల్లీలీటర్లు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చిత్త పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 మిల్లీ గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ–పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండలంలో 78 శాతం సర్వే పూర్తి

ముప్పాళ్ల: మండలంలోని ఇంటింటి సర్వే 78శాతం పూర్తయినట్లు తహసీల్దార్ ఎం.భవానీశంకర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మొత్తం 34,696 మంది ఓటర్లకు గాను ఇప్పటి వరకు 27,034 ఓటర్లను పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి బీఎల్‌ఓ నూరుశాతం సర్వే ప్రక్రియ పూర్తి చేయాల్సిందేనని పేర్కొన్నారు. డబల్ ఎంట్రీ ఓటర్లను పారదర్శకంగా విచారణ జరిపి ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలని, 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఫారం–6 ద్వారా ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఓటరు ఐడీలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం–8ద్వారా సవరించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఆర్ఐలు పవన్ కుమార్, కపిల్‌దేవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి యువకుడి ఆత్మహత్య



మాచవరం: కృష్ణానదిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచవరం మండలం పాత గోవిందాపురం గ్రామ కృష్ణానది వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కొప్పురావూరి అమరేష్ కుమార్(30) తన తండ్రి, బాబాయితో కలసి పిడుగురాళ్ల పట్టణం మెయిన్‌రోడ్డులో ఓ వ్యాపార దుకాణం నడుపుతున్నారు. ఇటీవల అమరేష్‌కుమార్ తండ్రి మృతి చెందాడు.
దుకాణం లావాదేవీలు తెలుసుకునేందుకు వెళ్లగా మృతుడి బాబాయి వ్యాపారంలో నష్టాలు ఉన్నాయని తెలిపాడు. వ్యాపార లావాదేవీలు సమక్రంగా లేవని, అప్పులు ఉన్నాయన్న మనస్తాపానికి గురై తన ద్విచక్ర వాహనంపై పాతగోవిందాపురం వద్దకు వచ్చి కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి తల్లి లక్ష్మీదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు.

జగనన్న భూరక్ష రైతులకు వరం



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు

పశర్లపాడు(రెంటచింతల): జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకం రైతులకు వరం అని తహసీల్దార్ కె.పుల్లారావు అన్నారు. మండలంలోని పశర్లపాడు గ్రామ సచివాలయంలో గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర రీసర్వే ద్వారా భూమి వివరాలను డిజిటల్ రికార్డులను నిల్వ చేయడం జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకం ప్రధాన లక్ష్యమన్నారు. దీంతో క్యూర్ కోడ్ ఆధారిత స్మార్ట్ టైటిల్ కార్డులు భూ యజమానికి జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో జరిగే అన్ని లావాదేవీలు సురక్షితంగా ఉంటాయని వివరించారు. భూమి హక్కుకు సంబంధించి భూమి యజమానికి హార్డ్ కాపీ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం డ్రాఫ్ట్ లాండ్ రిజిస్ట్రార్ (డీఎల్ఆర్)ను రైతులకు చదివి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వో షుకూర్, గ్రామ సర్వేయర్ బాలసైదులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..

గ్రామ సచివాలయాలు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వలంటీర్ వీరయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ సచివాలయాలు ఒక వేదిక అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వలంటీర్ల, సచివాలయ సిబ్బందికి అభినందన సభ సోమవారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలు సాధించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ అద్భుతంగా పని చేస్తోందని చెప్పారు. వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని అభినందించారు. పట్టణంలోని 33 వార్డుల్లోని సచివాలయ, వలంటీర్లను సన్మానించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. మొదట విడతగా 27 నుంచి 5వ వార్డు వరకు ఉన్న సచివాలయాలను విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, వలంటీర్లను ఎమ్మెల్యే చేతులు మీదుగా సన్మానించారు. రెండో విడతలో 6వ వార్డు నుంచి 18వ వార్డు, మూడో విడతలో 19 నుంచి 26వ వార్డు ఉన్న సచివాలయ సిబ్బందిని, వలంటీర్ల సన్మాన కార్యక్రమం చేయనున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దీన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బెండలో సస్యరక్షణతో అధిక దిగుబడులు



చల్లగుండ్ల గ్రామంలో బెండతోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి నవీన్‌కుమార్

నకరికల్లు: సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపడితే బెండలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి డి.నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని చల్లగుండ్లలో బెండతోటలను సోమవారం పరిశీలించారు. బెండసాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ బెండ సాగు చేసే పొలంలో ఆఖరి దుక్కిలో వేప పిండి, ఎస్ఎస్‌పీ వేయడం ద్వారా త్వరగా వేరు వ్యవస్థ అభివృద్ధి చెందడం చీడపీడలను తట్టుకునే సామర్థ్యం పంటలో పెరుగుతుందని అన్నారు. బెండలో రసం పీల్చు పురుగు, కాయ తొలుచు పురుగు అధికంగా సోకుతాయని వివరించారు. వారంలో ఒకసారి పురుగు మందు, మరోసారి వేప గింజల కషాయం లాంటివి పిచికారీ చేయాలన్నారు. యథేచ్ఛగా రసాయనిక పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా పురుగు ఉధృతి అదుపులోకి రాదని హెచ్చరించారు. తెల్లదోమ నివారణకు గాను ఎకరాకు 10–12 పసుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకుంటే ఉధృతిని బట్టి మందులు పిచికారీ చేయవచ్చని వివరించారు. 20 రోజులకు ఒకసారి ఫార్ములా–4 లీటరు నీటికి ఐదు గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయడం ద్వారా పూత, కాపు అధికంగా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీలకు అగ్రాసనం

- నియోజకవర్గంలో ఇద్దరికి రాష్ట్ర స్థాయి పదవులు
- మాట నిలబెట్టుకుంటున్న సీఎం వైఎస్ జగన్
- నేడు సత్తెనపల్లిలో బీసీ గర్జన



పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఆహ్వాన పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట నెల బెట్టుకుంటున్నారు. పార్టీ, ప్రభుత్వం, నామినేటెడ్ పదవుల భర్తీలో పెద్దపీట వేస్తున్నారు. తాజాగా గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన నిమ్మకాయల రాజనారాయణను ఎంపిక చేశారు. పార్టీనే నమ్ముకున్న వారికి సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తారనేందుకు ఉదాహరణ.
రాజనారాయణ 2009 సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికల వరకు ఆ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఎన్నికల సమయంలో కోడెల శివప్రసాదరావుకు టికెట్ కేటాయించారు. టీడీపీ 2014 ఎన్నికల్లో విజయం సాధించింది.

వైఎస్సార్ సీపీలో చేరి..

వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర సమయంలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం తీసుకున్నాడు. ఆ సమయంలో భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు రాజనారాయణకు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించి బీసీలకు పెద్ద పీఠ వేశారు.

నాగార్జున యాదవ్..

సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన యనమాల నాగార్జున యాదవ్ విద్యావంతుడు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పార్టీ పరంగా ఆయనకు రాష్ట్ర అధికార ప్రతినిధి హోదా కల్పించారు. అంతేకాక ప్రస్తుతం విద్యాభివృద్ధి మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. రెండు రాష్ట్ర స్థాయి పదవులను బీసీలకు కేటాయించి బీసీల పక్షపాతిగా ముఖ్యమంత్రి నిరూపించుకున్నారని బీసీ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా బీసీ కులాలకు చెందిన ప్రజలు ఉన్నారని, జనాభా కనుగుణంగా బీసీల్లోని జనాభా అధికంగా ఉన్న కులాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర మంత్రివర్గంలో 10 మంది బీసీలకు మంత్రి పదవులు కట్టబెట్టిన ఏకైక నేత వైఎస్ జగన్ అంటూ బీసీ వర్గాలు కితాబిస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన బీసీలకు పదవులు కట్టబెట్టి సామాజిక న్యాయానికి తెరదీసిన వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారని జేజేలు పలుకు తున్నారు.


ఓటు బ్యాంకు గానే వాడుకున్న టీడీపీ...

టీడీపీ ఏర్పాటైన తొలి రోజుల్లో రాష్ట్రంలోని బీసీల్లో మెజార్టీ ప్రజలు ఆ పార్టీ వెంట నడిచారు. ఎన్టీఆర్ అనంతరం పార్టీ పగ్గాలు చేపట్టిన చంద్రబాబు రాకతో బీసీలను కేవలం వాడుకుని వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో బీసీలు టీడీపీకి దూరం అవుతూ వచ్చారు. గత ఎన్నికల్లో బీసీలు అత్యధికంగా వైఎస్సార్ సీపీ వెంట నడిచారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏలూరులో బీసీ గర్జన నిర్వహించి సామాజిక న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకుంటూ వచ్చారనే భావం బీసీల్లో కనిపిస్తోంది.

నేడు బీసీ గర్జన...

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి బీసీ గర్జన నిర్వహించనున్నారు. ఈ గర్జనతో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు.

ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మహాసభలకు తరలిన ఉద్యోగులు



సత్తెనపల్లి: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్(ఆంధ్రప్రదేశ్) నాన్ గజిటెడ్ అధికారుల సంఘం 21వ రాష్ట్ర మహాసభలకు స్థానిక ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు సోమవారం పయనమయ్యారు. పట్టణంలోని ఏపీఎన్జీవో కార్యాలయం వద్ద ఏపీ ఎన్జీవోస్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు వాహన జెండా ఊపి ప్రారంభించారు.